# వి కృ తి

శకుంతలని గురించి నాకేఁవీ తెలియదు.

రఘుపతి నాకు చాలా మంచి మిత్రుడు.

న్యాయానికి ఈకథ యీ యిద్దరికీ మాత్రమే పరిమిత మైంది కాదు.

అయితే, 'ఈకథకి మాత్రమేగాదు, నా జీవనగాథకే నాయిక - శకుంతల' అంటాడు రవిప్రసాద్.

రవిప్రసాద్ ది ఒక చిన్న ఉపాఖ్యానం.

*　　*　　*

బస్సుస్టాండులోనే ప్రత్యక్షమయ్యాడు రఘుపతి. అతని ఉద్యోగం అక్కడే.

"ఏం గురూగారూ, ఎప్పుడు రావటం? క్షేమమేనా?" వాడని మల్లెపూవులాంటి మందస్మితం - అతని పెదవులకి ప్రత్యేకమైన ఆభరణం.

నేను సమాధానం చెప్పాను - అప్పుడే వస్తున్నట్లు.

రఘుపతి కాళ్ళు కాంటీన్ వైపు దారితీసేయి. నేనిక నేను కాదు. అస్వతంత్రుణ్ణి, అసహాయుణ్ణి అయిపోయేను. ఆ వూరు వెళ్ళినప్పుడల్లా నేనలాంటి సందిగ్ధస్థితిలో చిక్కుకుపోవటం నాకు యిదివరలో రెండుసార్లు అనుభవంలోకొచ్చిన యదార్థం.

కొన్ని నిముషాలు రచనావ్యాసంగపు సంగతులతో గడిచిపోయినై. కాఫీ సిప్ చేస్తూ మొదలెట్టేడు రఘుపతి.

"గురూగారూ- ఈమధ్య చాలా 'టైట్'గా వుంటోందండీ. క్షణం తీరిక చిక్కటంలేదు. లేకుంటే దేశాన్నో ఊపు ఊపేవాణ్ణి కాదూ?"

నేను సన్నగా నవ్వటం గమనించేడు కాబోలు, "సారీ ....దేశాన్ని కాదులెండి - పత్రికలవాళ్ళని! మన కథలు తిప్పి పంపటానికి, కేరళకు వెళ్ళే బియ్యపు వాగన్లు డైవర్టు చేయాల్సొచ్చేది." అంటూ తనూ నవ్వేడు.

క్షణాల తర్వాత కాలర్ సరిచేసుకున్నాడు. "మాష్టారూ నిజంచెప్పాలంటే గర్ల్‌ఫ్రెండున్న వుండటమంత దురదృష్టం మరోటి లేదండి. అయితే, అందులోవున్న 'ప్లెజర్'ని తలచుకుంటే, అదో గొప్ప అదృష్టంగా భావించక తప్పదు. చూడండి, మార్గరెట్ అని.... క్రిందటిసారి మీకు చెప్పేను- ఆమెవిషయం.... ఆమె నన్ను మరీ ఇరకాటాన పెట్టేస్తోందండి. ఏరోజు కారోజు ఏవేవో ఎంగేజిమెంట్స్ ఫిక్సప్ చేసి చంపేస్తోంది."

నేను 'పాపం' అన్నట్లు దిగాలు మొహం పెట్టేను.

రఘుపతి సిగరెట్ వెలిగించుకుని, నావైపు అదోలా చూస్తూ అన్నాడు, "మీరు పదహారోశతాబ్దపువారు గదూ ....అదిసరే, మన రవిప్రసాద్ కొత్తపిట్టని పట్టేడు. ఆనక చూద్దురుగానిలెండి.... బ్యూటిఫుల్ ....ఓహ్"

అతని చిన్మయానందం, అభినయించూస్తే నాకు నవ్వు రావటంకంటే ఎక్కువగా జాలికలిగింది.

"సరే, వివరాలు మఠంలో మాట్లాడుకుందాం. అక్కడ మీకు మరో కొత్తవార్తకూడా చెప్తాను" అంటూ లేచాడు. అంతలోనే నా కళ్ళల్లోకిచూసి, "మనకూ మనకూ పరిచయమై అప్పుడే చాలారోజు లైంది. మీరీవూరు రావటం యిది మూడోసారి. ఈసారి తప్పించుకోలేరు. రాత్రికో రేపో చీటీ కోసేయాల్సిందే" అని కౌంటర్ వైపు దారితీసేడు.

నేను నవ్వుకుంటూ అతన్ననుసరించేను. అతని పరిభాషలో మఠం అంటే మా మిత్రబృందమంతా కలిసే రామారావుషాపు. చీటీ కోయటమంటే - ఓగొప్ప ఘన కార్యం!

"ఆఫీసు వదలగానే, నేను గూటికి చేరుకుంటాను, మీరీలోపల ఊళ్ళో పనులు పూర్తిచేసుకురండి.' ఓ. కే."..... అంటూ అతను ఆఫీస్ వైపు నడిచేడు.

నేను యథాలాపంగా బస్ స్టాండు బయటికి కదిలేను. అయితే, నా మనస్సుమాత్రం వెనకడుగు వేసింది.

రెండేళ్ళకి(తం అభిమానపాఠకు డొకడు నా కథని మెచ్చుకుంటూ తన అభిప్రాయాన్ని జాబుద్వారా నాకు తెలియజేసేడు. తనూ వో ఛోటా రచయితనని పరిచయం చేసుకున్నాడతను.

ఆ తర్వాత కొన్నాళ్ళకు వ్యాపారరీత్యా వాళ్ళవూరు వెళ్ళేను. అక్కడ రామారావు మా ఏజంటు. అతనిషాపు లోనే ఆ రచయిత, మరికొందరు అభిమానులూ పరిచయ మైనారు.

ఆరచయితే రఘుపతి. ఆ అభిమానబృందంలో ముఖ్య మైన వ్యక్తి రవిప్రసాద్.

వాళ్ళంతా కలిసి ఆరోజు వో గార్డెన్ హోటల్లో నాకు విందు చేసేరు. ఆ సందర్భంలో వో నాలుగు గంటలు ఇంటర్వ్యూ జరిగింది.

రఘుపతి, రవిప్రసాద్ తొలిసారిగా నన్నడిగిన ప్రశ్న చిత్రమైంది. అలాంటిప్రశ్న నా కెదురుకావటం అదే మొదటిసారి. "మాస్టారూ, మీకు గర్ల్ఫ్రెండ్సు ఉన్నారా? —అయినా అదేంప్రశ్న లెండి నాబొంద. దేశంలో గొప్ప ప్రఖ్యాతిపొందిన రచయితలు - మీకు కాక మరెవరి కుంటా రులెండి గర్ల్ఫ్రెండ్స్...."

నేనొక క్షణంపాటు ఆలోచించి 'ఉన్నారు' అన్నాను.

'ఏంతమంది?'

'ఒక్కరే'

'రాముని కొక టే బాణము–జానకి అతని ప్రాణము....'
రెడ్డి కాబోలు రాగయుక్తంగా అన్నాడు. అతను ప్రభుత్వ సంగీత కళాశాలలో గాత్రం అభ్యసిస్తున్నాడు.

నే నతని మాటలకు అద్భుతగిలి, 'నిజవండోయ్, ఆమె పేరు జానకి' అన్నాను.

'వెరీగుడ్....'

'బ్యూటిఫుల్.' 'సింపుల్ అండ్ మార్వెలస్'

ఇలాంటి అభినందనలు వెలువడినై.

రఘుపతి మాత్రం నిరుత్సాహంగా పెదవి విరిచి 'ఒకే ఫ్రెండయితే మజాలన్నీ తెలీవండి. అదిసరే ఆమె ఏం చేస్తూంది? అన్నాడు

'ఇప్పుడేమీ చేయటం లేదు. ఓల్డు ఇంటర్ దాకా. చదువుకుంది. ప్రస్తుతం గుట్టుగా సంసారం చేసుకుంటోంది'

రవిప్రసాదు చిత్రంగా కళ్ళు చికిలించాడు. "ఐతే గురువుగారిది డిజెక్టెడ్ లవ్" అన్నమాట. సారీ సా

నేను నవ్వుకున్నాను. 'అలాంటిదేంకాదు. జానకి నా భార్య - పెళ్ళయినతర్వాత ఫ్రెండయింది.'

అందరూ కొన్ని నిముషాలవరకూ బిత్తరపోయేరు వాతావరణం గాంభీర్యాన్ని పులుముకుంది. అందరిగొంతులూ మూగపోయాయి.

నిశబ్దాన్ని భంగం చేస్తూ రఘుపతే అన్నాడు, 'ఐతే మీరు పదాహారో శతాబ్దపు వారన్న మాట. మాకోవకి రారు. పోన్లెండి నాసంగతి చెప్తాను.'

రామారావన్నాడు ' తేఁవ హరికథ యిప్పుడు లాభం లేదు. ఏ శ్రీరామ నవమి పందిళ్ళప్పుడో పెట్టిద్దాం.'

అంతా గొల్లున నవ్వేరు. ఇంతలో హోటల్‌లో మెరుపు తీగెలు మెరిసినై. రఘుపతీ, రవిప్రసాద్‌ల కళ్లు మిలమిల లాడినై. ఇద్దరూ గబగబా లేచి 'జస్ట్ ఏ మినిట్' అంటూ వాళ్ళ వేపు వెళ్ళేరు.

"వతి హడావిడి గాళ్ళండి. ఒక్కొక్కడికి పదిమంది దాకా వున్నారీ గరల్ ఫ్రెండ్స్. వాళ్లేమో వీళ్లని జూచి వూరి కేస్మయిల్ చేస్తూ వుంటారు. ఇక, బార్కింగంతా వీళ్ళ వంతు. గొంతు బొంగురు పోయే సమయంలో సెలవు తీసుకుంటారు" రామారావు నవ్వుతో మేమూ శ్రుతి కలిపేము

రఘుపతి ఓ పావు గంట తర్వాత వచ్చేడు. "సారీ గురూగారూ లేటయింది. ఆమె పేరు రాధాదేవి. మెడిసిన్ చదువుతోంద, అందం విషయంలో వీళ్ళెవరూ నాకు నచ్చరండీ, ఎందుకనంటే – మా సిష్టరు వుంది, ఆ అమ్మాయిపేరు శకుంతల. ఆమె ముందు వీళ్ళంతా దిగదుడుపే"

'రఘుపతి సిష్టర్ని గురించి మీరిక తఱచుగా వింటూ వుంటారు. ఆమె చక్కని చుక్క మాత్రమే కాదుట. గొప్ప జీనియస్‌ట. బియ్యే కాబోలు చదువుతోందిట—' అంతేనా రఘూ?' రెడ్డి అడిగేడు.

'అవును మాష్టారూ. మా శకూని తలచుకుంటే చాలు. నా హృదయమంతా ఆదోలా అయిపోతుంది. శకూ మా యింటి అదృష్ట దేవత. మా ఫాదర్ అంతగొప్ప

ప్రాపర్టీ ఎరన్ చేయడానికి, మా శకూ అదృష్టమే కారణ మంటాడు

'అయితే తంవరో "ల" అన్న మాట. ఏమాత్రం వుంటుంది?'

"ఆఁ ఎంతలెండి, వో పాతికెకరాలు మాగాణీ నాలుగు మేడలూ వున్నై.'

"అంతే, పాపం—మిడిల్ క్లాస్." రెడ్డి మాటలకి అందరూ గొల్లున నవ్వేరు.

" మా చెల్లికి పెళ్ళి చేయాలని చాలా సంబంధాలు చూసేమండి. కానీ, ఏదీ నచ్చలేదు. కాకిముక్కుకు కట్టి పెట్టడం ఇష్టలేదు. ఆమె అసలే అమాయకురాలు."

"రఘు మిసెస్ కూడా అంతేటండీ" రామారావు నావైపు చూస్తూ అన్నాడు.

నేనో క్షణంసేపు విచలితున్నయ్యేను. రఘుపతి వివాహితుడన్నమాట. చెల్లి, భార్య చాలా అమాయకులు, తనో....? నాలో ఏవేవో భావాలు చెలరేగినై.

మరో కొంతసేపటికి, అంతా లేచేరు.

రామారావు షాపుకొచ్చేం. సంభాషణలో అధిక భాగం దారినవెళ్తున్న యువతీమణులమీద అభిప్రాయాలను వెలిపుచ్చటంతోనే నిండిపోయింది.

ఉన్నట్టుండి రఘుపతి లేచి, రామారావు ఆఫీస్ రూమ్ లోకి వెళ్లి క్షణంలో తిరిగొచ్చేడు. అతనిచేతిలో పేక దస్త్రం!

"కమాన్....లెటజ్ రిలాక్స్" అంటూ కార్డ్సతీసి కత్తెరలు వేయసాగేడు. అందరూ 'ఓ.కే" అంటూ సంసిద్ధులయ్యేరు.

రఘుపతి నన్నూ చెయ్యి వెయ్యమన్నాడు. కానీ నాకు రంగులే తెలియవనటంతో నిరాశచెందేడు. వాళ్ళంతా రెండుపైసల స్టేక్‌లో దిగేరు. రమ్మీ జోరుగా సాగుతోంటే, నాకు తోచక విసుగ్గావుంది.

"జూదరేఖ - ఒక్క రఘుపతినే వరించడానికి కారణమేంమిటోనండీ." అంటూ లేచాడు రామారావు. అతను దివాళాతీసేడన్నమాట. ఆటలోనుంచి తప్పుకున్నాడు.

"గర్ల్ ఫ్రెండ్స్ ఎక్కువగా వుండటం." రవిప్రసాద్ ఠక్కున అన్నాడు. అంతా గొల్లున నవ్వేరు

వాతావరణం మారిపోయింది. ఆటని ఆపేశారు.

సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు రఘుపతి, "ఇక నెక్ట్స ప్రోగ్రామ్ నేచెప్తాను. వెళ్ళి చక్కగా దుర్గాలో యన్.వి. కొట్టేయటం, ఆనక సోఫియాలారెన్ పిక్చర్ "బొకాక్కసియో"కి చెక్కేయటం, రూమ్‌కి రాగానే చీటీ కోసేయటం. రేపు ఆదివారమేగా—ఫర్వాలేదు. పన్నెండింటిదాకా పడకేయచ్చు."

"నేను స్ట్రిక్ట్ వెజిటెరియన్‌ని" అన్నాను.

రఘుపతి తల పట్టుకున్నాడు. "సారీ గురూగారూ ఇదేంబాగాలేదు. ప్రతి సరదాలోనూ మిమ్మల్ని తొలగిస్తే

ఇక మాకు ఆనందంవేం వుంటుంది? మేమంటే రోజూ ఇలా గడిపే వాళ్ళమే. ఈ ప్రోగ్రామ్స్‌లో అన్నీ మాకు రెగ్యులర్. క్రొత్తేంకాదు. మీరు కనీసం పందొమ్మిదవ శతాబ్దం వరకన్నా పరిగెత్తుకరావాలి”

“నన్నిలా అబ్జర్వర్‌గా వుండనీయండి” అన్నాన్నేను.

ఆరోజు రాత్రి రఘుపతి చెప్పిన కార్యక్రమం నిర్విఘ్నంగా సాగిపోయింది. నేను కేవలం ఒడ్డున కూర్చుని ఏటిలో వస్తున్న కెరటాలను చూస్తూ, వాటి ఘోషనువింటూ వుండి పోవాల్సొచ్చింది.

ఆరోజు రాత్రే నాకు తొలిసారిగా అనిపించింది “ఈ శతాబ్దంలో బ్రతకటానికి యివన్నీ కనీసార్హతలు కాబోలు”

ఆరోజు రాత్రే చీటీ కోయటమనే ఘనకార్యపు నిర్వచనము, భాష్యం, భావం - అన్నీ అర్థం చేసుకున్నాను. ఆ రాత్రి పన్నెండు తర్వాత రఘుపతి రూమ్‌లో జరిగిన కార్యక్రమం అచ్చ తెనుగులో చెప్పాలంటే—

“ తాగి తందనాలాడటం ! ”

— రఘుపతి సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి వచ్చేడు. అప్పటికప్పుడే మిత్రబృంద మంతా చేరుకుని రామారావు షాపు పెంకులు లేపుతున్నారు.

వచ్చినప్పట్నించీ రవిప్రసాద్ క్రొత్తగా ‘పట్టిన’ గర్ల్ ఫ్రెండును గురించే మాట్లాడ సాగేడు రఘు పతి. ఆమె అంత అందగత్తె కాదుట. అదీ అసలు విషయం. దాన్ని ఆసరా

తీసుకుని అతన్ని హేళన చేయటం మొదలెట్టేడు. మధ్య మధ్య ఆడవాళ్లకే ఈర్ష్య కలిగించే తన చెల్లి శకుంతల అందాన్ని అణుకువల్ని గురించి చెప్పేడు.

బస్సు స్టాండులో చెప్తానన్న క్రొత్తవార్తనీ చెప్పేడు రఘుపతి.

అతనికి మూడవ కూతురు పుట్టింది!

మామూలు కార్యక్రమాలన్నీ ఆరోజు జరిగి పోయినై అందరూ కలసి నామీద ఎంతో "వత్తిడి" తెచ్చేరు— ఆ కార్యక్రమంలో పాల్గొనమని.

నాతో పరిచయంవుండి, నా వ్యక్తిత్వం తెలిసిన ప్రతి వాళ్ళూ నన్ను "మొండివాడు" అనే అంటారు.

ఒక ఏడాది గడిచింది.

ఈ ఏడాదిలోనూ నేను ఆవూరు వెళ్ళలేక పోయాను. అయితే రఘుపతి మాత్రం కథల గొడవని గురించి నాకు ఉత్తరాలు వ్రాస్తూ వుండేవాడు. వాటిలో అధికభాగం తన సంపదని గురించీ, తన చెల్లి శకుంతలని గురించీ వ్రాసే వాడు. చివరసారిగా వ్రాసిన ఉత్తరంలో కాబోలు తనకు హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అయిందని వ్రాసేడు.

—గూడూరు ప్లాట్ ఫారం మీద తారట్లాడుతుంటే. హఠాత్తుగా కనబడ్డాడు రవిప్రసాద్. అతను ప్యాసింజర్లో మద్రాసు వెళ్తున్నాడు.— ఎ.ఐ.ఆర్. సెలక్షన్ నిమిత్తం.

ఇద్దరంవూ కలిసి వెయిటింగ్ రూమ్ వైపు దారితీసేము.

రవిప్రసాద్ నెమ్మదిగా అడిగేడు, "రఘు విషయాలేం వైనా తెలుసా, మీాకు?"

కడసారిగా అతను వ్రాసిన జాబుని గురించి చెప్పేను.

కొద్దిసేపుతటపటాయించి చెప్పసాగేడు రవి "జీవితంలో నేనింత గట్టి దెబ్బ తింటానని ఏనాడూ ఊహించలేదు రావు గారూ, నిజం."

నేను ఆతృతగా అడిగేను, "ఏంవిటది?"

"ఏంవని చెప్పేది. బ్రతుకంతా జాలీగా గడిపే అదృష్టం నన్ను వరిస్తుందని కలగన్నాను. నా కల ఫలించ లేదు. ఎందరెందరో గర్ల్ ఫ్రెండ్స్‌తో పరిచయాన్ని పెంపొందించుకొని, ఆ పరిచయాన్ని మరోమెట్టు పైకెక్కిం చినా, నా అంతర్యం, అంతరంగంవేరు మాష్టారూ"

రవిప్రసాద్ ఆపేడు. సిగరెట్ వెలిగించుకొని, నావైపు పాకెట్ చూపి, అంతలోనే వెనక్కి తీసుకున్నాడు.

నాకు అతను చెప్పేదేంవిటో అవగతం కాలేదు.

"అవును. నేను తాత్కాలికమైన ఇంద్ర ధనుస్సుల్ని చూసి ఆనందపు భ్రమలో కొట్టుకుపోయినమాట వాస్తవమే. కాని, ఆ భ్రమ వెనుక ఆశ మరొకటివుంది. రఘుపతి నాలో అలాంటి ఆశలు రేకెత్తించాడు."

"రఘుపతి?" అప్రయత్నంగా అడిగేను.

"అవును. అతను నా అంతస్తుకు తగినవాడనుకు న్నాను. శకుంతలమీద నా ఆశలన్నీ కేంద్రీకృతంచేసి ఏవేవో మధురానుభూతుల్ని ఊహించుకున్నాను. నా ఊహలు గాలిమేడలైనాయి"

"అంటే-నువ్వు శకుంతలని ప్రేమించావా?"

"ప్రేమించటంకాదు, ఆరాధించాను. రఘు చెప్పిన మాటల్నిబట్టి శకుంతల రూపాన్ని ఊహించుకుని తీయటిబాధ ననుభవించి నాలో నేను మురిసిపోయేను."

"అయితే, యేంజరిగింది?"

"క్రిందటినెలలో అనుకోకుండా నేను వాళ్ళ స్వగ్రామం వెళ్ళేను."

"వెళ్తే....?"

రవిప్రసాద్ ఆగేడు. కొద్దిసేపు తటపటాయించాడు. సిగరెట్ పొగని చివరిసారిపీల్చి, దాన్ని అవతల పారేశాడు. అతను ఎక్కవలసిన రైలు కూతవేసింది. హడావిడిగాలేచి ప్లాట్‌ఫారంమీదికి నడుచేడు.

నేనతన్ననుసరిస్తున్నా నన్న మాటేగాని, మనసంతా కుతూహలంతో, ఉత్సుకతతో, ఆతృతతో నిండిపోయింది.

"ఇంతకీ అసలు విషయంచెప్పు"-అడిగేను.

రవిప్రసాద్ కంపార్ట్‌మెంటు ఫుట్‌బోర్డుమీద కాలు పెట్టాడు. గార్డ్ పచ్చజెండా చూపేడు. రైలు నెమ్మదిగా సాగుతోంది. నేనూ అడుగులు వేస్తున్నాను.

కళ్ళలో తిరిగిన నీటిని తుడుచుకుంటూ, వినపడీ వినపడనట్లు అన్నాడు రవిప్రసాద్. "రఘుకుటుంబం కటిక దరిద్రంలో పుట్టి పెరుగుతోంది. అది నేరంవేమీ కాదు. కాని...., శకుంతలకి చచ్చువాతం, కఱ్ఱలసాయంతో బ్రతుకుతోంది–పదిహేనేళ్ళనుంచీ. ఆమె చదువు—ఐదవ తరగతితోనే మూలపడింది." నేనలాగే మ్రాన్పడిపోయేను.

రైలు వేగాన్ని పుంజుకుంది.*